క్లుప్తంగా

బూరుగుపూడిలో క్రిస్మస్ వేడుకలు

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడి గ్లోరీ పెంతుకోస్తు చర్చిలో గురువారం క్రిస్మస్ వేడుకలు జరిగాయి. మండల రివైవల్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో డాక్టర్ పాలు క్రిస్మస్ సందేశాన్ని అందించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. పాస్టర్లు కె.విజయకుమార్, నవీన్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

120 హెక్టార్లలో ఉద్యాన పంటలకు నష్టం



రంగంపేటలో నీట మునిగిన బెండ తోటను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారులు

రంగంపేట: మెట్టప్రాంతమైన రంగంపేట మండలంలో తుపాను కారణంగా వరి, అపరాల పంటలతో పాటు ఉద్యానవన పంటలకూ నష్టం వాటిల్లింది. మండలంలోని కోటపాడు, నల్లమిల్లి, రంగంపేట, ఈలకొలను, వీరంపాలెం, దొంతమూరు, మర్రిపూడి, సుభద్రంపేట, సింగంపల్లి, ఎస్టీరాజాపురం, వడిశలేరు తదితర గ్రామాల్లో 195 మంది రైతులకు సంబంధించిన 120 హెక్టార్లలో బొప్పాయి, కర్రపెండలం, అరటి, జామ, కూరగాయలు, పూల తోటలకు నష్టం వాటిల్లినట్లు మండల ఉద్యానవన అధికారి కె.దివ్యశ్రీ తెలిపారు. నష్టం అంచనాలు ప్రభుత్వానికి అందిస్తామన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం



నాగంపల్లిలో వృద్ధురాలికి ఇంటి వద్దే పరీక్షలు చేస్తున్న డాక్టర్ రాజు

సీతానగరం: నాగంపల్లి గ్రామ సచివాలయంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.రాజు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా 435 మందికి వైద్య సేవలు అందించారు. అవసరమైన వారికి పరీక్షలు చేసి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. మంచంపై ఉన్న రోగుల ఇళ్లకు వెళ్లి సేవలు అందించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. ఎంఎల్‌హెచ్‌పీ సుందరి, సూపర్‌వైజర్ సుధాకర్, ఏఎన్ఎమ్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత పశు వైద్యశిబిరం



మునికూడలిలో పశువులకు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

సీతానగరం: మిచాంగ్ తుపాను నేపథ్యంలో పశువులకు ఇబ్బంది రాకుండా మునికూడలిలో గురువారం ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పశు సంవర్ధకశాఖ డీడీ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వెదుళ్లపల్లి పశు వైద్యులు భానుతేజ శిబిరంలో 2,012 పశువులకు సేవలు అందించారు. వాటికి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఆ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పి.ప్రభావతి, వైద్యశాఖ సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



రాజానగరం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద మొక్కలు నాటుతున్న సిబ్బంది

రాజానగరం: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు ప్రాంగణంలో పచ్చదనం- పరిశుభ్రతలో భాగంగా కార్యాలయ, అంగన్‌వాడీ సిబ్బంది గురువారం వివిధ రకాల మొక్కలను నాటారు. వాయు కాలుష్య నివారణలో చెట్ల ప్రాముఖ్యత గురించి సీడీపీఓ టి.నాగమణి వివరించారు. మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని అన్నారు. తమ ప్రాజెక్టు కార్యాలయం వద్దే కాకుండా అంగన్‌వాడీ కేంద్రాల వద్ద కూడా మొక్కల పెంపకానికి శ్రద్ధ తీసుకోవాలని సిబ్బందికి సూచించామన్నారు.

ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి

పెదపూడి: తుపాన్ ప్రభావం కారణంగా పంట దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ శివరామకృష్ణంరాజు కోరారు. గురువారం ఆయన శహపురం, కాండ్రేగుల గ్రామాల్లో పర్యటించి నేలనంటిన పాలాలను, తడిసిన ధాన్యపు రాసులను పరిశీలించి రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో టి.వెంకటేశ్వరరావు, కాకి సత్యనారాయణ, మార్ని విష్ణు, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క'న్నీరు' తుడుస్తూ.. కష్టం తీర్చుతూ

- నియోజకవర్గంలో ముంపునీట పొలాలు
- 6,485 హెక్టార్ల విస్తీర్ణంలో నష్టం
- రైతులకు అండగా నిలుస్తున్న ప్రభుత్వం



బుచ్చెంపేట- గుమ్ములూరు మధ్య గోదావరి ఎగపోటు వరదనీటిలో పంట

మధురపూడి: మిచాంగ్ తుపాను రైతన్న కష్టాన్ని నిండా ముంచింది.. ఆరుగాలం శ్రమించి పండించిన పంటలను తుడిచి పెట్టేసింది.. వర్షానికి నష్టపోయిన రైతులందరికీ సాయం అందేలా, కొండంత భరోసా నింపేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఏ ఒక్క రైతూ ఇబ్బంది పడకూడదన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో పంట నష్టంపై అధికారులు అంచనాలు రూపొందిస్తున్నారు. తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు, వెన్ను నీటమునిగిన, 30 రోజులు పైపడిన మొక్కజొన్న, పిందె దశలో ఉన్న మినుము పంటలకు సైతం పంట నష్ట పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. రాజానగరం నియోజకవర్గంలో తుపాను కారణంగా వర్షాలతో వాణిజ్య పంటలైన మొక్కజొన్న, పొగాలు, పొద్దుతిరుగుడు పంటలు సైతం ముంపు నీటిలోనే ఉన్నాయి. నియోజకవర్గంలోని మూడు మండలాల్లో 6,485 హెక్టార్ల విస్తీర్ణంలో పంటలకు నష్టం జరిగినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ఇందులో కోరుకొండ మండలంలో 2,455 హెక్టార్లు ఉండగా, ఇక్కడ వరి పంట 1,035 హెక్టార్లలో నష్టం జరిగినట్టు అంచనా. సీతానగరం మండలంలో పత్తి, జొన్న తదితర పంటల సాగులో మొత్తం 3,554 హెక్టార్లు, రాజానగరం మండలంలో 476 హెక్టార్ల విస్తీర్ణంలో పంటలు నీట మునిగాయని గుర్తించారు. మూడు మండలాల్లోని 43 గ్రామాలకు ముంపు సమస్య ఏర్పడింది. కోరుకొండ మండలంలో 17, సీతానగరం మండలంలో 17, రాజానగరం మండలంలో 9 గ్రామాల్లో పంట పొలాలు నీట మునిగాయి.

ఎమ్మెల్యే చొరవతో...

తుపాను కారణంగా పంట నష్టపోయిన రైతులకు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా కొండంత భరోసా ఇచ్చారు. ఈ మేరకు వైఎస్సార్ సీపీ యువజన విభాగం రీజినల్ కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్, జక్కంపూడి విజయలక్ష్మిలు నియోజకవర్గంలోని పంట పొలాలను పరిశీలించారు. రైతులను ఆదుకునేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని ధైర్యం చెబుతూనే, అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. దీంతో అధికారులు వేగంగా నష్ట నివారణ పనులు చేపడుతున్నారు.

ఇక్కడి పరిస్థితి వేరు

కోరుకొండ మండలంలో పరిస్థితి భిన్నంగా ఉంది. ఇక్కడ తుపాను ప్రభావం ఒక కారణమైతే బురద కాలువ, గోదావరి ఎగపోటు వరద కారణంగా పంట నష్టం జరుగుతోంది. తొర్రేడు వద్ద గోదావరి వరదనీరు తొర్రిగెడ్డ కాలువ నుంచి, ఇటువైపు గంగవరం మండలం సూరంపాలెం మిగుల జలాలు మండలాన్ని ముంచెత్తుతున్నాయి. దీంతో మండలంలోని బుచ్చెంపేట, గుమ్ములూరు, మునగాల, బూరుగుపూడి, కాపవరం, కోటి, శ్రీరంగపట్నం తదితర గ్రామాల్లో పొలాలు నీట మునుగుతున్నాయి. నాలుగు నుంచి వారం రోజుల పాటు నీరు నిల్వ ఉంటుంది.



బొల్లెద్దుపాలెంలో నేలకొరిగిన పంటను పరిశీలిస్తున్న అధికారులు

భరోసా ఇచ్చింది



రైతులకు రాష్ట్ర ప్రభుత్వం భరోసా ఇచ్చింది. తడిచిన ధాన్యాన్ని, నీట మునిగిన వెన్నును సైతం పంట నష్టంలోకి తీసుకువచ్చింది. తడిచిన ధాన్యాన్ని ఆరబెట్టే మర ఉన్న మిల్లులకు ధాన్యాన్ని పంపించే అవకాశాన్ని కల్పించింది. తద్వారా కోరుకొండ, సీతానగరం, గోకవరం మండలాల్లో నీట మునిగిన పంటను అక్కడికి పంపిస్తాం.

–బీకే మల్లికార్జునరావు, ఏడీ

బురద కాలువతో ముంపు



గోదావరి ఎగపోటు వరదనీటికి తోడు సూరంపాలెం ప్రాజెక్టు నీరు విడుదల చేయడంతో బురద కాలువ పొంగుతోంది. గుమ్ములూరు, బుచ్చెంపేట, మిర్తిపాడు, ఉండేశ్వరపురం, ఊనవరం, మునగాల, శ్రీరంగపట్నం, కోటి గ్రామాల్లో పంట పూర్తిగా నీటిలో ఉంది. మొక్కజొన్న కమర్షియల్ సాగు విస్తీర్ణం పెరిగింది. ఇదంతా నీట మునగడంతో ప్రభుత్వం రైతులకు న్యాయం చేస్తుంది.

–నక్కా రాంబాబు, ఏఎంసీ చైర్మన్, రాజానగరం

ఆందోళన చెందవద్దు

జక్కంపూడి విజయలక్ష్మి



తుపాను బాధితులకు నిత్యావసరాలు అందజేస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి

రాజానగరం: తుపాను ప్రభావిత ప్రాంతాల్లో బాధితులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని, ఈ విషయంలో ఎవరూ ఆందోళన చెందవద్దని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి భరోసా ఇచ్చారు. తూర్పుగానుగూడెంలో తుపాను ప్రభావిత ప్రాంతాల్లో గురువారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఎస్సీ కాలనీలో ముంపు నీట ఉన్న 17 కుటుంబాలకు ప్రభుత్వ సాయంగా 25 కిలోల బియ్యం, కందిపప్పు, ఉల్లిపాయలు, బంగాళదుంపలు, ఆయిల్ ప్యాకెట్లు తదితర నిత్యావసర సరకులను అందజేశారు. నష్టాల వివరాలను సంబంధిత అధికారులు సేకరిస్తున్నారన్నారు. బాధితులందరినీ ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పవన్‌కుమార్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, నాయకులు చల్లా వెంకట్, అబ్బిరెడ్డి వెంకటేశ్వరరావు, లక్ష్మణరావు, పెదిరెడ్డి శ్రీను, బొడ్డు రామ్మూర్తి, రామకృష్ణ, పల్లంకి శ్రీను, పెంకె భద్రరావు తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులకు న్యాయం చేస్తాం

ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



వెంకటాపురంలో తడిసిన వరి పనలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

రంగంపేట: తుఫాను ప్రభావంతో పంట నష్టపోయిన రైతులకు న్యాయం చేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. గురువారం రంగంపేట మండలం వెంకటాపురంలో వర్షం కారణంగా దెబ్బతిన్న పొలాలను, రోడ్డును ఆయన పరిశీలించారు. పొలాల్లో తడిసిపోయిన వరి పనలను, ధాన్యం రాసులను చూశారు. ఈ సందర్భంగా స్థానిక రైతులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని భరోసా కల్పించారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ ముంగి గంగరాజు, పార్టీ కన్వీనర్ మాగాపు వెంకటరమణ, ఎంపీటీసీ సత్తిబాబు, మండల కాపు సంఘం అధ్యక్షుడు మాగాపు కాశిబాబు, మాజీ ఎంపీటీసీ అంచూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు అనపర్తిలో గడప గడపకూ..

అనపర్తి: గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం అనపర్తి గ్రామ సచివాలయం-2 పరిధిలో నిర్వహించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి శుక్రవారం ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకుంటారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, అభిమానులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పేదల అభ్యున్నతే జగనన్న లక్ష్యం



వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి

అనపర్తి: పేదల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో విప్లవాత్మక సంస్కరణలు చేపట్టి అభివృద్ధికి బాటలు వేశారని అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని రామవరం గ్రామ సచివాలయం-2 పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం సంక్షేమ పథకాల లబ్ధి వివరాల బోర్డు, పార్టీ జెండాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, ఎంపీటీసీ నల్లమిల్లి భాగ్యలక్ష్మి, ఈఓపీఆర్డీ పద్మజ, సచివాలయ కార్యదర్శి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన



సింగవరంలో వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- సింగవరంలో గడప గడపకూ..

సీతానగరం: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్ పాలన సాగిస్తున్నామని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. గురువారం సింగవరంలో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి పథకాల గురించి వివరించడంతో పాటు ప్రజల సమస్యను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ రాష్ట్రంలో సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే పాలన తీసుకువచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. సింగవరంలో గడిచిన నాలుగేళ్లలో రూ.3.59 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. రూ.28.78 లక్షలతో నాడు- నేడు కార్యక్రమంలో మండల పరిషత్ పాఠశాల ఆధునీకరించామని, జల్‌జీవన్ మిషన్ పథకంలో రూ.67 లక్షలతో రెండు ఓవర్ హెడ్ ట్యాంక్‌ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. గ్రామంలో డ్రైనేజీల నిర్మాణానికి అన్ని చర్యలు చేపడతామన్నారు. అర్హత ఉంటే చాలు అందరికీ పథకాలు అందజేశామన్నారు. రానున్న రోజుల్లో ఈ పథకాలు అమలు కావాలంటే జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని రాజా అన్నారు. ఇదిలా ఉంటే వంగలపూడి యానాదుల కాలనీలో ముంపునకు గురైన 17 ఇళ్లలో కుటుంబాలకు ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చేతుల మీదుగా నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, కొంచ భాస్కరరావు, ఎంపీటీసీ సభ్యుడు కొమ్మిరెడ్డి వెంకటేశ్వరరావు, చిర్ల పోశియ్య, చొక్కా శ్రీను, పరిమి వీర్రాజు తదితరులు పాల్గొన్నారు

చినజీయర్ స్వామీజీని కలసిన ఎమ్మెల్యే రాజా



చినజీయర్‌స్వామీజీతో మాట్లాడుతున్న రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: విజయవాడలో ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త త్రిదండి చినజీయర్‌స్వామీజీని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా గురువారం కలుసుకున్నారు. రాజానగరం నియోజకవర్గంలోని కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద రూ. కోటితో త్వరలో ఐదంతస్తుల రాజగోపురం, రూ.1.15 కోట్లతో రంగనాథస్వామి ఆలయ పునర్నిర్మాణం గురించి స్వామీజీకి తెలియజేశారు. వీటికి సంబంధించిన శంకుస్థాపనలకు హాజరు కావాలని రాజా కోరారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ



రఘుదేవపురం విద్యార్థులకు సైకిళ్లు అందజేస్తున్న డీఈఓ అబ్రహం

సీతానగరం: రాజమహేంద్రవరం ఆనం కళాకేంద్రంలో బుధవారం రిలయన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధీరూబాయ్ అంబానీ క్విజ్ పోటీలలో ప్రతిభ చాటిన రఘుదేవపురం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు సైకిళ్లు అందించారు. పదో తరగతి విద్యార్థిని పి.అనూష, 9వ తరగతి విద్యార్థి సాయికిరణ్‌లు నాలుగో స్థానంలో నిలిచినందుకు సైకిళ్లు అందుకున్నారు. వీటిని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం చేతుల మీదుగా పంపిణీ చేశారు. అలాగే లక్కీ డిప్‌లో స్పోర్ట్స్ కిట్‌లను గెలుచుకున్నారు. హెచ్‌ఎమ్ ఎం.శ్యామలాదేవి, ఉపాధ్యాయురాలు వి.అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో ప్రతిభ



జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం చేతుల మీదుగా సైకిళ్లు అందుకుంటున్న విద్యార్థులు

అనపర్తి: రిలయన్స్ సంస్థ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం ఆనం కళాకేంద్రంలో ఈ నెల 6వ తేదీన నిర్వహించిన రిలయన్స్ క్విజ్ పోటీల్లో స్థానిక పాతవూరులోని కేఏఆర్ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభను చాటి బహుమతులు గెలుచుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 100కు పైగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీల్లో కేఏఆర్ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన సాత్విక్, జస్వంత్ టీమ్ సభ్యులు నాలుగో స్థానంలో నిలిచి జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం చేతుల మీదుగా సైకిళ్లు బహుమతులుగా గెలుచుకున్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, వారికి శిక్షణను ఇచ్చిన ఉపాధ్యాయులు రాంబాబులను పాఠశాల హెచ్‌ఎం కర్రి సుజాత, ఉపాధ్యాయులు అభినందించారు.

పేదల అభ్యున్నతి, అభివృద్ధి జగన్‌తోనే సాధ్యం



శహపురంలో సంక్షేమ పథకాల వివరాల బోర్డు ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

పెదపూడి: రాష్ట్రంలో పేదల అభ్యున్నతి, అభివృద్ధి ముఖ్యమంత్రి జగన్‌తోనే సాధ్యమవుతుందని ఎంపీపీ కేతా తులసి అన్నారు. శహపురంలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. సచివాలయం వద్ద సంక్షేమ అభివృద్ధి బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ తులసి మాట్లాడుతూ రాష్ట్రంలో సుపరిపాలన జగన్‌తోనే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ ఎం.సత్యనారాయణరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు చండ్రాళ్ల పార్వతి, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, పార్టీ మండల కన్వీనర్ గుత్తుల వెంకటరమణ, సొసైటీ చైర్మన్ గాజంగి వెంకటరమణ, చాండ్రాళ్ల వెంకటరమణ, గాజంగి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర



పెదపూడిలో వికసిత్ భారత్ సంకల్పయాత్రలో భాగంగా ర్యాలీ

పెదపూడి: కేంద్ర ప్రభుత్వ పథకాలను గ్రామాల్లో ప్రజలకు వివరించి అర్హులైన వారికి అందించడానికి వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం దోహదపడుతుందని నోడల్ ఆఫీసర్, ఎంపీడీఓ వీవీ సాయిబాబు తెలిపారు. కాండ్రేగుల, పెదపూడి గ్రామాల్లో గురువారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కోకన్వీనర్ మురముళ్ల వెంకటరమణ, తహసీల్దార్ టి.సుభాష్, ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి, సర్పంచ్‌లు కేవీవీ సత్యనారాయణ, కె.కృష్ణమూర్తి, సచివాలయ కార్యదర్శి మన్యం శ్రీనివాసుచౌదరి, వీఆర్వో చండి తదితరులు పాల్గొన్నారు.

మదన గోపాలునికి రజత కవచాల సమర్పణ



స్వామికి రజత కవచాలు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దంపతులు

అనపర్తి: మండలంలోని పొలమూరులో వేంచేసి ఉన్న రుక్మిణీ సత్యభామ సమేత మదనగోపాలస్వామికి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతుల చేతుల మీదుగా రజత కవచాలు గురువారం అందజేశారు. ఇటీవల పునర్నిర్మించిన ఆలయంలో ఉభయ దేవేరులతో కూడిన స్వామివారికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో, భక్తుల విరాళంతో సుమారు 6 కేజీలతో వెండి కిరీటం, హస్తాలు, పాదాలు తయారు చేయించారు. రజత కవచాలను తీసుకొచ్చిన ఎమ్మెల్యే దంపతులకు ఆలయ పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అంతకుముందు ఆలయబ్రహ్మ వాడపల్లి వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో మహా సంప్రోక్షణ జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్ తమలంపూడి వీరయమ్మ, ఆదిరెడ్డి దంపతులు హోమాది క్రతువులు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు సత్తి గీతావరలక్ష్మి, జెడ్పీ మాజీ ప్రతిపక్ష నాయకుడు సత్తి రామారెడ్డి, ఉపసర్పంచ్ సత్తి సూరారెడ్డి, మాజీ సర్పంచ్ మేడపాటి గంగిరెడ్డి, పారిశ్రామిక వేత్త సత్తి శ్రీనివాసరెడ్డి, కర్రి చక్రవర్తి, ఎంపీటీసీ సత్తి కనకారెడ్డి, తాడి అబ్బూస్‌రెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ తప్పిదంతోనే ముంపు సమస్య

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- అధైర్య పడవద్దని రైతులకు భరోసా
- బొబ్బిల్లంక- మిర్తిపాడు కల్వర్టు తొలగింపు



మిర్తిపాడు- బొబ్బిల్లంక కల్వర్టు వద్ద రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: టీడీపీ తప్పిదం కారణంగానే రైతులు నష్టపోతున్నారని, మిర్తిపాడు- బొబ్బిల్లంక తొర్రిగడ్డ కాలువపై కల్వర్టు వల్లే పంట పొలాలు ముంపులోకి వెళ్తున్నాయని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తెలిపారు. మిచాంగ్ తుపాన్‌తో కురిసిన వర్షాలకు సీతానగరం, కోరుకొండ మండలాల్లో పంట పొలాలు ముంపులోకి వెళ్లాయి. పంట పొలాల నుంచి నీరు తొర్రిగడ్డ కాలువ మీదుగా వెళ్లాల్సి ఉంది. అయితే గత టీడీపీ హయాంలో కల్వర్టు నెలకొల్పి దాని కింద వైశాల్యం తక్కువ ఉన్న తూరలు ఏర్పాటు చేశారు. దీంతో తూరలకు చెత్త అడ్డుపడి నీరు వెళ్లడం లేదు. ఫలితంగా పంట పొలాల్లో వర్షం నీరు లాగక రైతులకు తీరని నష్టం జరుగుతోంది. గురువారం రఘుదేవపురం, ఉండేశ్వరపురం, కాటవరం, మిర్తిపాడు, బొబ్బిల్లంక, కోరుకొండ మండల బుచ్చింపేట, ములగాడ, గుమ్ములూరు తదితర గ్రామాల నుంచి సుమారు నాలుగు వందల మంది రైతులు కల్వర్టు వద్దకు తరలివచ్చారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు వారు సమాచారం అందించగా హుటాహుటిన చేరుకుని రెండు పొక్లెయిన్లను రప్పించి కల్వర్టును తొలగించే పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ టీడీపీ హయాంలో నిర్మించిన కల్వర్టుతో రైతులు నష్టపోతున్నారని, దీనిని తొలగించి ఎత్తులో బ్రిడ్జి నిర్మాణానికి సంబంధిత శాఖ ద్వారా నివేదిక పంపించామని, రూ.3.50 కోట్ల నిధులు కేటాయించారన్నారు. ఇది టెండర్ల ప్రక్రియలో ఉందని, త్వరలో కల్వర్టు పనులు చేపడతామన్నారు. రైతులకు నష్టం కలిగించే విధంగా ఉన్న కల్వర్టును తొలగించి, ముంపు నుంచి పంట పొలాలకు విముక్తి కల్పించామన్నారు. రైతులు అధైర్య పడవద్దని, అన్నివిధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా వివరించారు. కల్వర్టును తొలగించే పనులు చేపట్టడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

బాధితురాలికి చేయూత



బాధితురాలికి ఆర్థిక సాయం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గోకవరం: తుపాను ప్రభావంతో ఇల్లు దెబ్బతిన్న బాధితురాలికి ప్రభుత్వం అండగా నిలిచింది. వివరాల్లోకి వెళితే.. స్థానిక మురళీనగర్ ఊరకాలువ సమీపంలోని పెరుమళ్ల సోమాలమ్మ అనే మహిళ ఇల్లు వర్షాలకు దెబ్బతింది. ఆమెను స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు పరామర్శించి ప్రభుత్వపరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. దీనిలో భాగంగా గురువారం ప్రభుత్వసాయంగా రూ.10 వేలు నగదు అందజేశారు. అలాగే బాధితురాలికి గోకవరం సొసైటీ అధ్యక్షుడు గాజింగం సత్తిబాబు బియ్యం, కూరగాయలు, నగదు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర వీరబాబు, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ కర్రి సూరారెడ్డి, టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్, వీఆర్వో శశికళ, తదితరులు పాల్గొన్నారు.